# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# జాతీయ వార్తలు

తేదీ: 29-12-2025 సమయం : రాత్రి 8గం. 30ని.లు

## ముఖ్యాంశాలు

- కృత్రిమ మేధస్సు ద్వారా ఓల్ చికీ లిపిలో అనువాద సాధనాలను అభివృద్ధి చేయాలని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము కోరారు.
- ఈశాన్య రాష్ట్రాలలో గత పదకొండేళ్ళలో విశేషమైన అభివృద్ధి జరిగిందని కేంద్ర హోం మంత్రి అమిత్ షా పేర్కొన్నారు.
- భారత్ - ఆస్ట్రేలియా దేశాల మధ్య వాణిజ్య సంబంధాలు మరింత బలోపేతం కానున్నాయని కేంద్రమంత్రి పీయూష్ గోయల్ తెలిపారు.
- ఖతార్ లో జరిగిన ప్రపంచ రాపిడ్ చెస్ ఛాంపియన్ షిప్‌లో కోనేరు హంపి కాంస్య పతకం సాధించింది.
- వాయువ్య భారతదేశ రాష్ట్రాల్లో రాబోయే రెండు రోజుల పాటు దట్టమైన పొగమంచు కొనసాగే అవకాశం ఉందని భారత వాతావరణ విభాగం (ఐఎండి) వెల్లడించింది.

=========================

కృత్రిమ మేధస్సు (ఏఐ) ప్రక్రియ ద్వారా ఓల్ చికీ లిపిలో అనువాద సాధనాలను అభివృద్ధి చేయాలని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము కోరారు. జార్ఖండ్‌లో జంషెడ్‌పూర్ సమీపంలోని కరండి ప్రాంతంలో ఉన్న దిశోమ్ జహెర్‌థాన్‌లో సంతాలీ భాష ఓల్ చికీ లిపి శతాబ్ది ఉత్సవాలకు రాష్ట్రపతి ముఖ్య అతిథిగా ఈరోజు హాజరయ్యారు. ఓల్ చికీ లిపి పితామహుడిగా ప్రాచుర్యంలో ఉన్న పండిట్ రఘునాథ్ ముర్ము విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. 22వ పర్సి మహా సంతాలీ సమ్మేళనంలో తన మాతృభాష అయిన సంతాలీలో రాష్ట్రపతి మాట్లాడుతూ... ఓల్ చికీ లిపిలో సంతాలీ భాషలోకి రాజ్యాంగాన్ని అనువదించే ప్రయత్నాలు జరగడం హర్షణీయమన్నారు. సంతాలీ భాషకు మరింత ప్రోత్సాహాన్ని అందించాలని అన్నారు. రాష్ట్రపతి వెబ్‌సైట్‌ను ఓల్ చికీ లిపిలో చూడాలన్న ఆశాభావాన్ని ద్రౌపది ముర్ము వ్యక్తం చేస్తూ..

(వాయిస్ 29 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =

సమాజంలోని అన్ని వర్గాలను కలుపుకున్నప్పుడే అర్థవంతమైన అభివృద్ధి సాధించగలమని ఉప రాష్ట్రపతి సీ.పీ. రాధాకృష్ణన్ పేర్కొన్నారు. పాండిచ్చేరి విశ్వవిద్యాలయం కులపతి కూడా అయిన ఉపరాష్ట్రపతి.. విశ్వవిద్యాలయం 30వ స్నాతకోత్సవ కార్యక్రమానికి ఈరోజు అధ్యక్షత వహించి ప్రసంగించారు. కృత్రిమ మేధస్సు, ఆటోమేషన్, బయోటెక్నాలజీ డిజిటల్ కనెక్టివిటీ మానవ జీవితంలోని ప్రతి అంశాన్ని పునర్నిర్మిస్తున్నాయని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. అందుబాటులోకి వస్తున్న ఆధునిక సాంకేతికతతో పాటుగా నైతిక అప్రమత్తత సైతం అవసరమన్నారు. డిజిటల్ సాధనాలు ఉత్పాదకత కనెక్టివిటీని పెంచగలిగినప్పటికీ.. అవి మానవాళి లోతైన ఆలోచనలపై ప్రభావం చూపరాదని యువ పట్టభద్రులను హెచ్చరించారు. జాతీయ విద్యా విధానం-2020కి రాయబారులుగా మారాలని ఉపరాష్ట్రపతి వారిని ఈ సందర్భంగా కోరారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఈశాన్య రాష్ట్రాలలో గత 11 సంవత్సరాల్లో విశేషమైన అభివృద్ధి జరిగిందని కేంద్ర హోం మంత్రి అమిత్ షా తెలిపారు. అసోంకు ఒక రోజు పర్యటన నిమిత్తం వచ్చిన ఆయన అనేక ప్రాజెక్టులను ప్రారంభించారు. అనంతరం నాగావ్ జిల్లాలో జరిగిన బహిరంగ సభలో మాట్లాడుతూ... అసోంలో వేగవంతమైన ప్రగతి సాగుతోందని గుర్తు చేశారు. కేంద్రప్రభుత్వ విధానాల వల్ల ఈశాన్య రాష్ట్రాలలో శాంతి నెలకొందని అమిత్ షా పేర్కొంటూ...

(వాయిస్ 30 సెకన్లు)

ఈ పర్యటనలో భాగంగా గువహటి పోలీస్ కమిషనర్ కార్యాలయం నూతన భవనం, ఇంటిగ్రేటెడ్ సిటీ సర్వైలెన్స్ సిస్టమ్‌ను అమిత్ షా ప్రారంభించారు. గువహటిలో 5 వేల సీట్ల సామర్థ్యం గల జ్యోతి బిష్ణు కల్చరల్ కాంప్లెక్స్‌ను కూడా అమిత్ షా ప్రారంభించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =

భారత్ - ఆస్ట్రేలియా దేశాల మధ్య వాణిజ్య సంబంధాలు మరింత బలోపేతం కానున్నాయని కేంద్ర వాణిజ్యం, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ తెలిపారు. 2026 జనవరి 1వ తేదీ నుండి భారతీయ ఎగుమతులపై ఆస్ట్రేలియా వాణిజ్య సుంకాలను పూర్తిగా ఎత్తివేస్తుందని సామాజిక మాధ్యమం పోస్టులో ఆయన ఈ రోజు పేర్కొన్నారు. దీని వల్ల కార్మిక ఆధారిత రంగాలకు కొత్త అవకాశాలు లభిస్తాయని చెప్పారు. రెండు దేశాల మధ్య కొనసాగుతున్న వాణిజ్య ఒప్పందాల కారణంగా 2024-25లో ఆస్ట్రేలియాకు భారతీయ ఎగుమతులు 8 శాతం పెరిగాయని చెప్పారు. ఉత్పత్తి, రసాయనాలు, వస్త్రాలు, ప్లాస్టిక్, ఫార్మాస్యూటికల్స్, పెట్రోలియం ఉత్పత్తులు, రత్నాలు, ఆభరణాలు తదితర రంగాల ఉత్పత్తుల ఎగుమతులలో మంచి వృద్ధి రేటు కనిపించిందన్నారు. ఈ ఒప్పందాల వల్ల భారతీయ ఎగుమతిదారులు, ఎంఎస్ఎంఈలు, రైతులు, కార్మికులకు ప్రయోజనం చేకూరుతోందని పీయూష్ గోయల్ వెల్లడించారు.

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఢిల్లీ నగరంలో కాలుష్యాన్ని ఎదుర్కోవడానికి కృత్రిమ మేధస్సు (ఏఐ) డేటా ఆధారిత వ్యవస్థను వినియోగించుకుంటామని ఢిల్లీ పర్యావరణ శాఖ మంత్రి మంజిందర్ సింగ్ సిర్సా తెలిపారు. ఇందుకోసం ఐఐటీ కాన్పూర్‌తో కలిసి పని చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని చెప్పారు. సూక్ష్మ స్థాయిలో ఉన్న కాలుష్య వనరులను గుర్తించడం, వాటి ప్రభావాన్ని శాస్త్రీయంగా అంచనా వేయడం, దానికి అనుగుణంగా చర్యలు చేపట్టడం వంటివి ఈ కార్యక్రమం ఉద్దేశాలుగా ఆయన తెలిపారు.

=======================

ఆరావళి పర్వత శ్రేణి నిర్వచనంపై నవంబర్ 20న జారీ చేసిన తన సొంత ఉత్తర్వుపై ఈ రోజు సుప్రీంకోర్టు స్టే విధించింది. ప్రధాన న్యాయమూర్తి సూర్య కాంత్ న్యాయమూర్తులు జె.కె. మహేశ్వరి, ఎ.జి. మాసిహ్‌లతో కూడిన వెకేషన్ బెంచ్, ఆరావళి పర్వతాలకు సంబంధించి నిర్వచనం పరంగా పరిశీలించాల్సిన అంశాలను అధ్యయనం చేయడానికి కొత్త నిపుణుల కమిటీని ఏర్పాటు చేయాలని కూడా ఆదేశించింది. ఇదిలా ఉండగా.. కేంద్ర పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పుల శాఖ మంత్రి భూపేందర్ యాదవ్ ఆరావళి శ్రేణికి సంబంధించి సుప్రీం కోర్టు తన సొంత ఉత్తర్వులపై స్టే విధించడం, అలాగే సమస్యలను అధ్యయనం చేయడానికి కొత్త కమిటీని ఏర్పాటు చేయడం వంటి నిర్ణయాలను స్వాగతించారు. ఆరావళి పర్వత శ్రేణి సంరక్షణ, పునరుద్ధరణ కోసం కేంద్ర ప్రభుత్వం తరఫున అన్ని విధాలుగా సహకరిస్తామని సామాజిక మాధ్యమం పోస్టులో తెలిపారు. ఆ ప్రాంతంలో కొత్త మైనింగ్ లీజులతో పాటు ఇప్పటికే ఉన్న వాటి పునరుద్ధరణపై కూడా పూర్తి నిషేధం అమలులో ఉందని భూపేందర్ యాదవ్ పేర్కొన్నారు.

=======================

పంజాబ్, హర్యానా, చండీగఢ్, ఢిల్లీ, ఉత్తరప్రదేశ్, హిమాచల్ ప్రదేశ్, బీహార్‌లోని కొన్ని ప్రాంతాలలో రాబోయే రెండు రోజుల పాటు దట్టమైన పొగమంచు కొనసాగే అవకాశం ఉందని భారత వాతావరణ విభాగం (ఐఎండి) తెలిపింది. మరిన్ని వివరాలను ఐఎండి సీనియర్ శాస్త్రవేత్త అమిత్ భరద్వాజ్ తెలియజేస్తూ…

(వాయిస్ 24 సెకన్లు)

=======================

ఉత్తర భారతదేశంలోని అనేక రాష్ట్రాలలో దట్టమైన పొగమంచు కారణంగా పలు విమానాలు, రైళ్ల రాకపోకలకు అంతరాయం కలుగుతోంది. ఢిల్లీకి వెళ్లే దాదాపు 18 రైళ్లు మూడు గంటలకు పైగా ఆలస్యంగా నడుస్తున్నాయని ఢిల్లీ రైల్వే డివిజన్ అధికారులు తెలిపారు. పొగమంచు వాతావరణం కారణంగా ఈరోజు 64 విమానాలు రద్దు చేశామని ఢిల్లీ విమానాశ్రయం అధికారులు వెల్లడించారు.

=======================

ఖతార్‌లో జరిగిన ప్రపంచ రాపిడ్ చెస్ ఛాంపియన్‌షిప్‌లో ఆంధ్రప్రదేశ్ కి చెందిన సీనియర్ గ్రాండ్‌మాస్టర్ కోనేరు హంపి కాంస్య పతాకాన్ని సాధించింది. డిఫెండింగ్ ఛాంపియన్‌గా బరిలో దిగిన కోనేరు హంపి ఈ విజయం అందుకున్నారు. మహిళల విభాగంలో ఆమె ఈ కాంస్య పతకం దక్కించుకున్నారు. వరల్డ్ రాపిడ్ చెస్ ఛాంపియన్‌షిప్‌లో ఇప్పటిదాకా మొత్తం 5 పతకాలను కోనేరు హంపి దక్కించుకున్నారు.

=======================

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు ఈరోజు నష్టాల్లో ముగిశాయి. సెన్సెక్స్ ఉదయం 85 వేల 041 పాయింట్ల వద్ద నష్టాల్లో ప్రారంభమై… చివరికి 345 పాయింట్ల నష్టంతో 84 వేల 695 వద్ద స్థిరపడింది. నిఫ్టీ సైతం 100 పాయింట్లు నష్టపోయి 25 వేల 942 వద్ద ముగిసింది. డాలరుతో పోలిస్తే రూపాయి మారకం విలువ 89 రూపాయల 98 పైసలుగా ఉంది. అంతర్జాతీయ మార్కెట్‌లో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 61.79 డాలర్ల వద్ద కొనసాగుతుండగా.. బంగారం ఔన్సు 4 వేల 465 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

=======================
=======================